



ప్రొఫెసర్ జితేంద్ర కలం ఆపకుండా త్వరత్వరగా వ్రాస్తున్నాడు. మనసులో మెదిలే అక్షయ జీవ రహస్యాలకి అక్షర రూప మిస్తున్నాడు. అతని తల చుట్టూ వెలుగు చక్రం లేదు, మేధావి అని తెలియ జేయటానికి. కాని భావ తీవ్రతలో అతని ముఖం ఎర్రబడి వుంది. మామూలు మనిషికి తీవ్ర ఆలోచన భావ తీవ్రత అతి బాధాకరమైన శిక్ష. కాని జితేంద్ర కది ఆనందం. క్షణం ఆలోచించక పోతే ఏదో వెలితి, చికాకు– నీటిలో స్వేచ్ఛగా ఈదే చేప గట్టున పడినపుడు పడే బాధ!

విశ్వ విద్యాలయంలో జీవశాస్త్ర విభాగానికి ఒక ప్రత్యేకత వుంది. డిపార్టుమెంటులో చాల మంది ప్రొఫెసర్లున్నా ప్రొఫసర్ అంటే అది జితేంద్రకే పరిమితం. జీవ శాస్త్ర ప్రత్యేకతకు మూల కారణం జితేంద్ర. అతను చేసిన కృషి.

వయస్సు నాలుగు పదులు దాటక పోయినా మూడు పదులకు పైగా "పి.హెచ్.డి."లను తయారు చేసిన ఘనత, కీర్తి జితేంద్రకే దక్కింది. అది అతని అదృష్టం. అతని విద్యార్థుల అదృష్టం. చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకొనే అతని విద్యార్థు లెందరో!

ప్రొఫెసర్ జితేంద్ర సార్థక నామధేయుడు. అపార జీవ శాస్త్ర రహస్యాలను ఆపోశన పట్టిన అగస్త్యుడు. జీవశాస్త్ర రూపు రేఖలు సరిదిద్ది అపూర్వ సృష్టి చేస్తున్న అపర విశ్వామిత్రుడు. ప్రొఫెసర్ జితేంద్ర మాట్లాడే జీవశాస్త్ర విజ్ఞాన సర్వస్వం. ఇవి జితేంద్ర అభిమాన విద్యార్థుల అభిప్రాయాలు. కష్టపడి పని చేసే వారికి జితేంద్ర పెన్నిధి. పనంటే భయపడే వారికి అతనంటే పెద్ద భయం. విలాస విద్యార్థుల దృష్టిలో అతనొక ఘోటక బ్రహ్మచారి; కర్కోటకుడు, నల్లబంతి! లోకోభిన్నరుచి!

జితేంద్రకు సాయంకాలం వచ్చిన ఉత్తరాలు చదివి అందులో ముఖ్యమైన విషయాలను గుర్తు పెట్టింది యామిని. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో ఒక విశేషం జితేంద్రకు అంతర్జాతీయ జీవశాస్త్ర విషయాల ఫిద జరిగే సదస్సుకు అధ్యక్షత వహించ వలసిందిగా వచ్చిన ఆహ్వానం. అలాంటి ఆహ్వానాలు రావటంక్రొత్త కాదు. యామిని జితేంద్ర దగ్గర డాక్టరేట్ పట్టం పొంది డిపార్టుమెంటులో "పోస్టు డాక్టరేట్" ఫెలోగా పని చేస్తూ వుంది. యామిని ప్రొఫెసర్ ఉత్తరాలు చూడటానికి సహాయపడుతుంది. అవసరమైన విషయాల గురించి క్లుప్తంగా విరామం వీలు దొరికి నప్పుడు జితేంద్రకు చెప్తుంది. అతి ముఖ్యమైన విషయాలు, వివరాలు అతని డైరిలో తేదివారిగా వ్రాస్తుంది. జితేంద్ర వుత్తరాలలో డైరిలో వ్యక్తిగత రహస్యాలేవి వుండవు. వ్యక్తిగత రహస్యాలకు అతీతంగా వున్నంతగా పరిణితి చెందిన నిజమైన విజ్ఞాని జితేంద్ర.

* * * *

జితేంద్ర బుద్ధి తెలిసే వయస్సుకే కాన్వెంటులో వున్నాడు. కాన్వెంటు తరువాత కాలేజి చదువు. కాన్వెంటుకు కాలేజికి సెలవు వచ్చినా అక్కడే. హాస్టలే అతనికి ఇల్లు. ఆప్యాయంగా పిలిచి ఆదరించే వారు లేరు. చిన్నతనంలో పెనుభూతంలా భయ పెట్టిన ఒంటరితనం నుండి రక్షణ కల్పించిన ఆయుధం పుస్తకం! అతనికి తల్లి దండ్రి ఎవరో తెలియదు. బంధువు లెవరో తెలియదు. ఒంటరితనం అతన్ని అందరి నుండి వేరు చేసింది. మిత్రులు కూడ లేక పోయారు. అతన్ని లాలించి వూరడించిన చల్లని తల్లి చదువు. ఒక విధంగా సమాజం నుండి సామాన్య విషయాల నుండి ఒంటరి వాడయ్యాడు. నెల తప్పకుండా కావలసిన డబ్బు ఒక లాయరు పంపుతూ వచ్చాడు. తల్లి తండ్రుల గురించి తెలుసుకోవాలని ఎంతో ఆతురతతో ఉత్కంఠతో అడిగినప్పుడు లాయరు చెప్పిన సమాధానం జితేంద్రకు మంచు కొండ నెత్తిన పడ్డటయింది. అతని తల్లి తండ్రులు ఒక యాక్సిడెంటులో మరణించారు. జితేంద్ర మేజరయ్యాక తల్లితండ్రులు వదలి వెళ్ళిన మూడు లక్షల ఆస్తికి వారసు డయ్యాడు. జితేంద్ర జీవశాస్త్రం చదవ టానికి కారణం ఒక విధంగా అతనిలో గూడు కట్టుకొన్న తల్లి తండ్రులు లేని వెలితి, ఆవేదన. వారెక్కడి కెళ్ళారు. జీవి పుట్టుక ఎలా జరుగుతుంది? పుట్టిన ప్రతి జీవి ఏమవుతుంది? – ఈ జిజ్ఞాస. అతి చిన్న వయస్సులో ఆకర్షించింది జీవశాస్త్రం. అదే అభిమాన విషయంగా మారింది.

జితేంద్ర చిన్నతనం నుండి పొల్లు పోని చక్కటి క్రమశిక్షణ చట్రంలో పెరిగాడు. ఆట లేదు. పాట లేదు. విశ్రాంతి లేదు. చదువు, ఆలోచన, పరిశోధన అతని జీవితం. విశ్వ విద్యాలయంలో ఉద్యోగం వచ్చాక పరిశోధనాలయమే ఇల్లు! వేళకు జవాను తెచ్చి పెట్టే భోజనం. రుచి పాటింపు లేని యాంత్రిక భోజన పద్ధతి.

* * *

"ప్రొఫెసర్"! యామిని నెమ్మదిగా పిలిచింది. జితేంద్ర కళ్ళు తెరిచాడు. జీవ రహస్యాల తెరలు మాయమయ్యాయి– నీ రెండకు మంచు తెర్లలా. ఎదుట సజీవ శిల్పంలా కన్పడింది. పాలి కళ్ళు నిండిన యామిని పాల రాతి బొమ్మలా. ఆమని సంధ్యలో విచ్చు కొన్న మల్లె మొగ్గలా చిరునవ్వుతో పలకరించింది. అల్లిక బుట్ట నుండి ప్రసాదం తీసింది.

"దేవుని ప్రసాదం" అంది.

"దేవుని ప్రసాదం!" ఆశ్చర్యంగా చూసాడు.

"ఏ దేవుని ప్రసాదం? ..... ఆఁ ఆ దేవునికి. పెళ్ళయిందా? అయితే ఎంత మంది పిల్లలు?" యామిని చిరునవ్వుతో ప్రసాదం జితేంద్ర చేతిలో పెట్టింది. ప్రసాదం బాగా పరికించి చూస్తూ తిన్నాడు. యామిని ఎదుట కుర్చీలో కూర్చుంది. జితేంద్ర కను బొమ్మలు పైకేగరేసి "ప్రసాదం చాల బాగుంది" అన్నాడు. అది, పటిక బెల్లం తీయగా వుందన్న పసి పిల్ల వాని ధోరణి. యామినికి తెలుసు అతని మాటలు. యాంత్రికంగా వచ్చినా అతి సహజాలు. తీవ్ర ఆలోచనా సరళి నుండి బయట పడినప్పుడు వెలువడే మామూలు మాటలు, పసి పిల్లల ప్రశ్నలు!

ప్రొఫెసర్ జితేంద్ర ఆజాను బాహువు. సౌష్టవ విగ్రహం. సుందరరూపి. అతని ఆకారంలో, ఆలోచనలో, ప్రవర్తనలో ఒక ప్రత్యేకత వుంది. క్రొత్తగా పరిచయమైన వారికి అతని నడవడి వింతగా విచిత్రంగా వుంటుంది.

మందహాసంతో మెల్లగా అన్నాడు, "యామినీ! ఏమిటి విశేషాలు? ప్రపంచం ఎలా నడుస్తూ వుంది?"

యామిని చిరునవ్వు నవ్వింది. ఆ రోజు పోస్టు విశేషాలు చెప్పింది. డైరి చూపింది. డైరి పేజీలు క్షణాలలో త్రిప్పాడు. కళ్ళు మూసు కొన్నాడు. ఆలోచన సముద్రంలో పడ్డాడు. అందమైన విచిత్ర పురుగు అసలు రహస్యాల స్వరూపం అదుపు లోకి తేవాలని ఆలోచనలో మునిగి పోయాడు. అంతు చిక్కని రహస్యాల వలయం! విచిత్ర పురుగు జీవిత విశేషాలు సృష్టికి మూలాధారాల్లాతోచాయి కళ్ళు తెరిచాడు.

"యామినీ! మొన్నటి ప్రయోగం ఈ రాత్రికి పూర్తి కావాలి. పంద్రెండు గంటలకు పూర్తి చేయగలవా?"

"అలాగే ప్రొఫెసర్" అన్నది యామిని – అది ఆజ్ఞలా, వరప్రసాదంలా. నిజంగా ప్రయోగం చేసేటప్పుడు రాత్రే పగలు, పగలే రాత్రి. వెళ్ళి ప్రయోగం ముందు కూర్చున్నది. రీడింగు తీయటానికి చాల టైమ్ వుంది. తన రూము కెళ్ళింది. స్నేహితురాలు పద్మిని వచ్చి పలకరించి వెళ్ళింది. ఒక మారు కొంత భావ గర్భితంగా హాస్యంగా పద్మిని అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"జీనియస్ జితేంద్రకు మీకు జంట కుదిరితే ఇక జీవ శాస్త్రం మూడు పువ్వులు ఆరు కాయలు!"

జితేంద్రతో జంట కుదరాలని అందాల అమ్మాయిలు, బంగారు బొమ్మలు చాల మంది పంతం పట్టి - కక్ష కట్టి వేధించి అతన్ని సాధించ లేక పోయారు. కొందరతని వాత్సల్య చూపులతో పునీతులైనారు. అతని సంయమనం వజ్రకఠోరం. అన్ని వేళలా అతని నిగ్రహం నిరుప మానం. లౌకిక విషయాల ఆటు పోట్ల తీవ్రత ఎరుగని, గుర్తించని శాంతి సాగరం జితేంద్ర. యామిని జితేంద్రకు ప్రియమైన విద్యార్థి మాత్రమే. ఆమెకు తెలుసు అంతకు మించి ఆలోచించటం గగన కుసుమాన్ని కాంక్షించటమని.

కాంక్షకు-మొదటి ప్రతి బింబాలు కళ్ళు. అతని కళ్ళలోకి టార్చి వేసి వెతికినా కోరిక ఛాయలు కన్పడవు. నిప్పు వుంటే గదా పొగ! ప్రేమ, స్వేచ్ఛ. పేర్లతో విశృంఖలతను పెంచుతున్న సమకాలీన సమాజంలో ప్రలోభాల కతీతంగా, ఏకాకిగా- జీవ శాస్త్ర పరిశోధనే ఏకైక జీవిత లక్ష్యంగా- ఒక వినూత్న వరవడికి వారసుడు జితేంద్ర. సులక్షణ సంపన్నుడు. అనుక్షణం మెదడుకు పదును పెట్టే మనిషికి రాగ భావం ఎలా విన్పడు తుంది? రక్తి భావన ఎలా కలుగు తుంది? అతని ఆస్తి, సంపాదన. జీవితం పరిశోధనకే అంకితం. అనుక్షణం అపార జీవరహస్యాల తెరలు ఛేదించే వ్యక్తికి జీవిత రహస్యాల ఆకర్షణ ఏముంది? యామిని హృదయం జితేంద్రకు అంజలి గటించింది.

* . * *

జితేంద్ర లయ తప్పకుండా ఇసుక పొరల మీద యాంత్రికంగా నడుస్తున్నాడు. నిరంతరం జిజ్ఞాసువులా చింతనా మగ్నుడై ఆలోచనా తరంగాలలో తేలిపోతున్నాడు. అప్పటికే జాలరి పిల్లలు ఇసుక తిప్పల మీద నిలవని గుజ్జన గూళ్ళు కట్టి కట్టి అలసిపోయి ఎక్కడి వాళ్ళక్కడ నిద్ర పోయారు.

జితేంద్ర సముద్ర తీరం చేరాడు. విచిత్ర పురుగును పట్టటానికి తెచ్చిన వెదురు చువ్వ, చువ్వ చివర సంచి, సంచి మూతి బిగించటానికి దారం సరిచేశాడు. చువ్వను అలలమీదికి విసిరి కూచున్నాడు. అలలు పలుమారు అతని పాదాలను అభిషేకిస్తున్నాయి.

పున్నమి వెన్నెల సాగర కెరటాల మీద తేలి ఆడుతూ వింత సోయగాన్ని విరజిమ్ముతూ వుంది. జితేంద్ర ముగ్ధుడై వింత సోయగాన్ని తనివి తీర వీక్షిస్తున్నాడు. పున్నమి కెరటాల మధ్య తేలివచ్చే విచిత్ర పురుగు కోసం ఎదురు చూస్తూ కూచున్నాడు. అవి మనిషి నీడ చూస్తే క్షణంలో మాయమవుతాయి. వళ్ళంతా కళ్ళున్న విచిత్ర పురుగులు.

జితేంద్ర అలవాటు ప్రకారం క్షణం కళ్ళు మూసుకొన్నాడు. బాహ్య ప్రపంచ దృశ్యం మసక చీకటిలా మాయమయ్యింది. విజ్ఞాన నేత్రం విచ్చుకొన్నది. జీవరహస్యాల పొరలు కాంతి వంత మవుతున్నాయి. కాంతి తెరల కావల జీవకణాల సంయోగం! వియోగం? ఆ విన్యాసం అనూహ్యంగా వుంది.

శూన్యం, నీరు, వెలుతురు- గాలి, మట్టి - మనిషి?

అంతా తెలిసిన వాడు లేడు.

ఏమి తెలియని వాడు లేడు.

జీవశాస్త్రం పంచేంద్రియాలకు అవగతమయ్యే విజ్ఞాన శాస్త్ర పద్ధతి మీద ఆధార పడివుంది. విజ్ఞాన శాస్త్ర పద్ధతి ఎంత వరకు వాస్తవం? ఆ పద్ధతి కూడా మారటం లేదా? జీవ సిద్ధాంతం విజ్ఞాన శాస్త్ర పద్ధతికి ఎంత వరకు అందుబాటులో వుంది? పంచేంద్రి యాలకు అవగతమయ్యే ప్రకృతి స్వరూపం ఎంత? శాస్త్రీయ పద్ధతి చట్రంలో ఇమడని- పంచేంద్రియాలకు అవగతం కాని ప్రకృతి స్వరూపం ఎంత? జితేంద్ర జీవ శాస్త్ర పరిధులు దాటాడు.

ఎక్కడో వింత శబ్దం ! కడలి కెరటాల హోరులో ఆర్తనాదంలా విన్పడింది. చివాలున లేచాడు జితేంద్ర. చుట్టూ కలియ జూశాడు. వెన్నెల ప్రకృతి నావరించి ఉవ్వెత్తున ఎగసే కెరటాలతో చిక్కపడి భువిని దివిని కలుపుతూ వుంది. కాంతి మయం చేస్తూ వుంది. వింత సంయోగం? విచిత్ర స్వరలహరి. మరలా వింత శబ్దం! అలాంటి శబ్దం అది వరకెన్నడు వినలేదు-జితేంద్ర. ఇసుక తిప్పల మీద దూరంగా పడవ. జితేంద్ర చువ్వను ఇసుకలో లోతుగా గుచ్చి అటు వైపునడిచాడు.

పడవ ప్రక్కన వెన్నెల సెల ఏటిలో సాగర సంగీతం వింటూ జాలరి పడుచు జంట నగ్నంగా సరసం? రెప్ప పాటులో జితేంద్ర వెనుదిరిగాడు. అడుగులో పిడుగు పాటు తప్పినట్లయింది. జాలరి జంట కంట పడలేదు జితేంద్ర. ఆకలి రుచి ఎరుగదు వలపు సిగ్గెరుగదు!

జితేంద్ర విచిత్ర పురుగు కోసం చువ్వ విసిరాడు అలల మధ్యకు. కెరటాలు లేస్తున్నాయి నాగు పాము పడగల్లా. వెన్నెల్లో కలుస్తున్నాయి. వెన్నెల కెరటాలుగా మారుతూ వుంది. వెన్నెల కెరటాల మధ్య అపూర్వ సౌందర్యం ఉదయిస్తూ వుంది. సౌందర్య రూపు రేఖలు దిద్దుకొంటూ వుంది. జీవ కళను నింపుకొంటూ వుంది. ఎవరిది? ఏమిటి విచిత్రం? జితేంద్రకు అంతు పట్టలేదు. కళ్ళు పులుము కొని విప్పార జూశాడు. అంతా వెన్నెల మయం. కళ్ళు మూసు కొన్నాడు.



అదే సౌందర్యం? అదే జీవకళా స్వరూపం. ఆప్యాయంగా ఆహ్వానిస్తూ వుంది. అనురాగలహరిలో తెలియాడుతూ దగ్గరకు వస్తూవుంది. ముగ్ధ మోహనంగా పలకరిస్తూ వుంది. అంత వరకు 'కణ' పరీక్ష, 'అణు' పరీక్షనె పరిమితమైన అతని జీవితం ఆ స్నిగ్ధ సౌందర్య విన్యాసానికి తట్టుకో లేక పోతూ వుంది. అతనిలో ప్రకృతిలో పులకరింపు కలిగింది.

ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు – వెదకుతున్న వింత పురుగు కళ్లకు కట్టినట్లని పించింది. చివాలున లేచాడు. పురుగు మాయ మయింది. వేడికి వెన్న కరిగి నట్లు ఏదో మార్పు విచిత్రంగా వుంది. అలాగే కూర్చున్నాడు. ఎంత సేపు కూచున్నాడో తెలియదు. కొండంత మబ్బు ఆకాశాన్ని ఆవరించింది. వెలుగు వెన్నెల మాయ మయింది. కెరటాలు గాలికి విసురుగా కొట్టు కొంటున్నాయి. కెరటాల మీద నురుగు విసురు గాలికి కదిలే మల్లె పొద మీద విచ్చుకొంటున్న పూగుత్తిలా వుంది. కొండల్లా మబ్బులు పేరు కొంటున్నాయి. తీవ్ర సంఘర్షణ జరుగుతూవుంది. ఉరుములు మెరుపులు ఆకాశంలో! ఉత్తుంగ తరంగాలు సాగరంలో! ధ్వని ప్రతిధ్వనిలా వినూత్న శబ్ద తరంగాలు. ఆకాశాన్ని, సాగరాన్ని కలుపుతూ విద్యుల్లతలా సౌందర్య రేఖ! ఆ వెలుగులో పాల రాతి బొమ్మ! ముగ్ధ మోహన మందహాసం! జితేంద్ర హృదయంలో మొదటిసారిగా మార్మిక స్పర్శ!

## వారుణి

వారుణీ దిశాంచలాలలో
నిరీక్షిస్తున్నాను
నీ దర్శనం కోసం
తనువంతా కనులు చేసుకుని.

నీ ఆగమన ముహూర్తమేదో
నిర్గమన సమయమెపుడో
తెలియకుండా
ఈ దోబూచు లేమిటి ప్రభూ!

— గోవిందరాజు రామకృష్ణరావు

## అల

అనురాగ స్పందన!

జితేంద్ర చేయిజారి అలల మధ్యకెళ్లి సాగరంలో కలిసింది చువ్వ. అతను ప్రయోగశాల వైపు నడక సాగించాడు. ఉరుములతో ఆకాశం బ్రద్దలవుతూ వుంది. అలలలో ఇసుక తిప్పలు కరిగిపోతున్నాయి. అడుగులు ఇసుకలో కూరుకపోతున్నాయి. నడక సాగించటం కష్టంగా వుంది. హోరు గాలిలో కొట్టుకపోతున్నాడు జితేంద్ర. మెరుపు దీపం కాదు. మబ్బు గొడుగుకాదు. ముద్దగా తడిసిపోయాడు జితేంద్ర. ప్రయోగశాల చేరాడు. యాంత్రికంగా పరుపు మీద వాలిపోయాడు తడి బట్టలతో! ఫాన్ తిరుగుతూ వుంది. చల్లగాలి తగులుతూ వుంది. కాని మనస్సు వేడెక్కుతూ వుంది. పైన ఫాన్‌లా జితేంద్ర మనస్సు గిర్రున తిరుగుతూ వుంది.

* * * * *

యామిని ప్రయోగం పూర్తి చేసేసరికి రాత్రి రెండు గంటలయింది. ఫలితాలను భద్రపరచి ప్రొఫెసర్ రూములో లైటు చూసి అటు వచ్చింది. బాధతో కూడిన మూలుగు విని జితేంద్రను సమీపించింది. అతనిలో సత్యాన్వేషణ చేసే స్థితప్రజ్ఞ లేదు. అతని చూపులో వాత్సల్య ఛాయలు లేవు. అర్థంకాని బాధతో మూలుగు?

"ఏమయింది ప్రొఫెసర్" యామిని ఆదుర్దాగా అడిగింది.

"ఏమిటో తెలియటంలేదు యామినీ!...

నాలో ఏదో విద్యుత్తు ప్రవహిస్తున్నట్లుంది. బడబాగ్ని రగిలి నన్ను దహించి వేస్తున్నట్లుంది."

"డాక్టర్లను పిలవనా సార్?"

"వద్దు యామినీ, వద్దు. నాలో ఏదో మార్పు వస్తూ వుంది. నీవిక్కడ నుండి వెళ్లిపో". అర్థంకాని అనుబంధం ఆమెను చుట్టివేసింది. కరుణ, జాలి, వాత్సల్యంతో జితేంద్ర దగ్గర చేరింది.


విజయ ఆదిత్య క్రియేషన్స్ వారి

ప్రేమసాగరం వారి తదుపరి ప్రేమకథాచిత్రం



మైథిలీ నా ప్రేయసి


నిర్మాత: స్వర్ణసుందరి.పి నిర్వహణ: మధు.పి

దర్శకత్వం: టి.రాజేందర్ M.A

AJAYADS

కృష్ణా-గుంటూరు: సరోజ ఎంటర్‌ప్రైజెస్, తెనాలి, తూ: వసుధా చిత్ర, విజయవాడ. వైజాగ్-శ్రీకాకుళం: శ్రీ ప్రకాష్ పిక్చర్స్, తూ: విజయలక్ష్మి ఫిలింస్, వైజాగ్. ఉ: జయలక్ష్మి మూవీస్ రాజమండ్రి. వె: జయగణేష్ ఫిలింస్, రాజమండ్రి, తూ: ఉషా పిక్చర్స్, ఏలూరు. నెల్లూరు: విజయదుర్గా సినీ ఎంటర్‌ప్రైజెస్, గుంటూరు. సీడెడ్: శ్రీ కామాక్షి మూవీస్, కడప
నైజాం: శ్రీ సాయిరాం ఫిలింస్, సికింద్రాబాద్

# స్పర్ధయా వర్ధతే విద్యా




## ధర్మపథం

విద్య వృద్ధి పొందడానికి అభ్యాసం ఒక్కటే కారణం కాదు. అభ్యాసంతో పాటు ఆ విద్యను గురించిన దృఢనిర్ణయం ఉండాలి. ఆసక్తి చూపినప్పుడే అది సాధ్యమవుతుంది. బాగా చదివి తరగతిలో మంచి మార్కులు తెచ్చుకొన్న వారిని చూచి "నేనూ కొంత శ్రద్ధతో చదివితే అంతకంటె ఎక్కువ మార్కులే తెచ్చుకోగలను. వాని గొప్ప ఏముంది?" అని అలస స్వభావం కలవారు అంటూ వుండడం పరిపాటి. వారిని ఎవరు చదవవద్దన్నారు? ఇతరులను చూచి అసూయపడక, వారూ శ్రమపడి చదివి పేరు తెచ్చుకుంటే అందరూ సంతోషిస్తారు. ఇలా పోటీపడి చదివితే విద్య వృద్ధి పొందుతుంది. అందువల్లనే "స్పర్ధయా వర్ధతే విద్యా" అని అన్నారు. విద్యాభివృద్ధికి ఇది మిక్కిలి ముఖ్యమైనది. విద్యార్థుల శ్రద్ధను వృద్ధి పొందించడానికి – వారికి ప్రోత్సాహం కలిగించడానికి విద్యాశాలల్లో బహుమతులు నెలకొల్పడం, ఉపకార వేతనాలు ఇవ్వడం జరుగుతూ ఉన్నది.

విద్యాభివృద్ధి క్రమశిక్షణ గల పాఠశాలల మూలంగానూ, కళాశాలల మూలంగాను సక్రమంగా జరుగుతుంది. అంతే కాని సక్రమమైన విద్యాశాలల్లో చేరకుండా తమ్ము క్రమశిక్షణతో పర్యవేక్షించి, పరీక్ష ప్యాసు కావడమే ప్రధాన లక్ష్యంగా కాక, విద్యాభివృద్ధిని, శ్రేయస్సునూ కోరే సంస్థలలో చేరి విద్య నభ్యసించడం మేలు. విద్యాభివృద్ధికి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం కొలతబద్ద కాదు. ఒకసారి కారణాంతరాల వల్ల పరీక్షలో తప్పిపోవడం వల్ల నిరుత్సాహమూ పొందనక్కర్లేదు. పోటీలు పడినప్పుడు ఒకప్పుడు తెలివైన వారు కూడా నెగ్గకపోవచ్చు. మరొకప్పుడు ఆ ఓడిపోయిన వారే ఘనవిజయం సాధించవచ్చు.

విద్యలో వలెనే క్రీడల్లో కూడా పోటీలు ఏర్పాటు చేయబడుతున్నాయి. ఆటల పోటీలే విశ్వవ్యాప్తంగా ఉంటున్న సంగతి అందరికీ తెలుసు. ఆటల్లో చూపినంత ఉత్సాహం విద్యలో కానరాలేదని కూడా అనుకోవచ్చు. విద్య విషయంలో కూడా ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి.

ఏ పోటీ అయినా అసూయకూ, విరోధానికి చాలా దూరంగా ఉండాలి. అప్పుడే అవి తగిన స్పర్ధలని అనిపించుకుంటాయి. విద్యాభివృద్ధికి, శరీర సౌష్ఠవానికి ఉద్దేశించిన పోటీలను యువకులు ఉపేక్షించకూడదు. వాటి వల్ల అన్నివిధాలా మేలు కలుగుతుంది.

–బులుసు వేంకట రమణయ్య

---

"క్షమించండి, ప్రొఫెసర్? మిమ్మల్ని ఈ స్థితిలో వదలి వెళ్లలేను. వెళ్లను." అంటూ జితేంద్ర నుదుట మీద చేయి పెట్టింది. తల పెట్టి పోతున్నట్లు నరాలు ఆడుతున్నాయి.

"యామినీ! నాలో ఏదో జవశక్తి ప్రకోపించింది. ఉద్ధృత ప్రవాహంలో కొట్టుకు పోతున్నాను. సృష్టి రహస్యాల సుడి గుండంలో గిర్రున తిరుగుతున్నాను అదుపు తప్పిన అల నన్ను ముంచేస్తూ వుంది"

* * * * *

"మేడమ్! గుడ్‌మార్నింగ్" పద్మిని ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ నవ్వింది. యామిని వ్రాస్తున్న కలం ఆపి పద్మినిని చూసింది.

"ఏమిటంత ఆనందం?" అడిగింది.

పద్మిని యామిని కళ్లలోకి నిశితంగా చూసి తల దించుకొన్నది.

"చెప్పనా మేడమ్!

"ఊ"

"మేడమ్, చాల ఆనందంగా వుంది. మరో జీవి యస్ పుట్టబోతున్నందుకు ఎంత సంతోషంగా వుందో చెప్పలేను." యామిని సిగ్గుపడింది. నెమ్మదిగా నవ్వింది.

"పద్మినీ! ప్రొఫెసర్‌తో జీవితం సాగించటం అసిధారావ్రతం లాంటిది. జీవశాస్త్ర సమగ్ర స్వరూప నిరూపణే అతని జీవితం. అందులో భాగంగా ఆయనకు దొరికిన ఒక స్పెసిమెన్ నేను!" యామిని బరువుగా నిట్టూర్చింది.

"పద్మినీ! జగద్గురు శంకరాచార్య పరకాయ ప్రవేశంతో జీవితానుభవాలను తెలిసికొన్నట్లు కథ వుంది. ప్రొఫెసర్ జితేంద్ర అనుభవం కూడా అలాంటిదే. విజ్ఞాన శాస్త్ర పద్ధతిని అధిగమించె భావన ఏదో జితేంద్రను తలమునకలు చేస్తూ వుంది. చెలియలి కట్టను దాటే అల". □